నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | జూన్ 28, 2024 | www.navatelangana.com

బోధన్ ఆర్టీసీ డిపోలో ప్రగతి చక్రం అవార్డుల ప్రదానం



నవతెలంగాణ-బోధన్

బోధన్ ఆర్టీసీ డిపోలో గురువారం ప్రగతిచక్రం అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు వారి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచడంతో వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ




నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని 161వ జాతీయ రహదారిపై జగన్నాథ్‌పల్లి వద్ద ఎస్సై రాములు ఆధ్వర్యంలో వాహనాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు పాత చాలాన్లను వెంటనే చెల్లించాలని అన్నారు. వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపి ఇంటికి చేరుకోవాలని అన్నారు. అదే విధంగా వాహనదారులు తమ వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకొని ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్లు తప్పక ధరించి జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటులో ఫీజుల బాదుడు

యేటా ఫీజులు పెంచుతున్న ప్రైవేట్ పాఠశాలలు

- ప్రభుత్వ నియమ నిబంధనలు గాలికి
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

పిల్లలకు మంచి విద్య అందించి వారి భవిష్యత్ బాగుండాలని తపించే తల్లిదండ్రుల ఆశను కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ముచేసుకుంటున్నాయి. యేటా ఫీజులు పెంచుతూ వారి నడ్డి విరుస్తున్నాయి.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో 25 ప్రైవేట్ పాఠశాలున్నాయి. ఇందులో బాన్సువాడ పట్టణంలో 18 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో 5 వరకు కార్పొరేట్ స్థాయిలో కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రయివేట్ పాఠశాల ఫీజుతో పాటు బుక్స్, ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్ ఫీజులంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని ఓ కార్పొరేట్ స్థాయి పాఠశాలలో ఎల్‌కేజీ విద్యార్థికి ఏడాదికి అన్ని ఫీజులు కలిపి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులు గతేడాది కంటే ఈ ఏడాది మళ్లీ అధికమవ్వనున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రైమరీ విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.30వేలు, హైస్కూల్ విద్యార్థులకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు.

నిబంధనలు గాలికి..

ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఆర్టీఐ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యలో 25శాతం మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలి. విద్యుత్ అధికారుల అనుమతి పత్రం, అగ్నిమాపక అధికారులచే ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శానిటైజర్ ధ్రువీకరణ పత్రం పొందాలి. అర్హులైన ఉపాధ్యాయుల చేత విద్యా బోధన అందించాలి. ప్రవేట్ పాఠశాలకు పక్కా భవనాలు ఉండాలి. కానీ ఇందులో చాలా వరకు శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్లతో పాఠశాలలో కొనసాగుతున్నాయి. గతంలో బాన్సువాడ పట్టణంలో రేకుల షెడ్డు గోడపడి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన అందరికీ తెలిసిందే. ప్రస్తుతం బాన్సువాడ డివిజన్‌లో ఇలాంటి పాఠశాలలో ఎన్నో ఉన్నా.. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం చెందుతున్నారు. అర్హత లేని ఉపాధ్యాయుల చేత విద్య బోధన కొనసాగుతున్నా. పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలలు వ్యవహరిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అమలు కాని ప్రభుత్వ ఉత్తర్వులు..

రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు 2017లో ప్రభుత్వం కమిటీ వేసింది. ఆ కమిటీ 2018లో ప్రైవేట్ పాఠశాలలో ఏటా 10శాతం ఫీజులు పెంచుకోవచ్చంటూ ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించింది. ప్రభుత్వం కమిటీ సిఫార్సులను అమలు చేయలేదు. తర్వాత 2020 ఏప్రిల్‌లో అధిక ఫీజులు నియంత్రించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడం లేదు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ ఫీజు వసూలు చేయకూడదని నిబంధన ఉంది. కానీ బాన్సువాడ డివిజన్ కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా విద్యాధికారులు ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకొని అధిక ఫీజులను నియంత్రించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యాధికారుల వాటా ఎంత..?

బాన్సువాడ డివిజన్ పరిధిలో ప్రైవేటు పాఠశాల యజమాన్యాలు బుక్స్, డ్రెస్సులు, టై, బెల్టు, బూట్లు, ఐడికార్డు పేరుతో అధిక వసూలు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రైవేటు పాఠశాలలో ఏమైనా వాటా ఉందా అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు ఎలాంటి వాట లేనప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిబంధనలను ఉల్లంగించిన పాఠశాలలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నప్పుడు సౌకర్యాలు కూడా అలా కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఫీజు నియంత్రణలో జిల్లా విద్యాశాఖ అధికారుల చొరవ ఎంతైనా ఉంది.

అంతా మా ఇష్టం

- చర్చనీయంగా మారుతున్న మున్సిపల్ అధికారుల తీరు
- తైబజార్ వేలం.. కొందరికే సమాచారం
- నవతెలంగాణ కథనంతో నోటీసు ప్రకటించిన మున్సిపల్ అధికారులు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో తైబజార్ వేలం ఈ సంవత్సరం మార్చి నెలతో ముగిసింది. ముగిసి మూడు నెలలైనా ఇప్పటివరకు తైబజార్ వేలం వేయకపోవడంతో నవతెలంగాణలో కథనం ప్రచురి తమైంది. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు ఈనెల 29న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అది పత్రిక ప్రకటన కాకుండా కేవలం కొన్ని పత్రికలకే సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎక్కువగా పత్రికలలో వస్తే ఎక్కువ మంది టెండర్ దారులు వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఇప్పటివరకు కొనసాగుతున్న తైబజార్ నిర్వాహకులతో కుమ్మక్కై, లోపల తైబజార్ వేలాన్ని నిర్వహించుకుంటున్నట్టు సమాచారం. 27న పత్రికలో వచ్చింది. 29న తై బజార్ వేలానికి సిద్ధం చేశారు. తద్వారా ఏ విధంగా వేలంలో పాల్గొంటామని తైబజార్ వేలంలో పాల్గొనే ఔత్సాహికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సంవత్సరం తై బజార్ వేలంలో పాల్గొనాలని చాలామంది ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. దీంతో గతంలో కొనసాగుతున్న కాంట్రాక్టర్‌తో మున్సిపల్ అధికారులకు అయినట్టు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 29న వేలం కాకుండా వేలం సమయాన్ని పొడిగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం మున్సిపల్ పరిధిలో చాలామందికి తెలియదు. కొన్ని పత్రికలకే పరిమితం చేసి తూతూ మంత్రంగా పత్రికలో వార్తా వచ్చే విధంగా చేసి పాత టెండర్ దారులకే ఈ తొమ్మిది నెలల కాలాన్ని కూడా వారికి అప్పగించాలనే ప్రయత్నంలో మున్సిపల్ అధికారులు ఉన్నట్లు సమాచారం. గత కొద్ది నెలలుగా మున్సిపల్‌లో ఏ విషయం జరిగినా చర్చనీయాంశంగానే మారుతుందని పట్టణంలోని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రకటనలు పదిహేను రోజుల ముందు ప్రకటన ఇవ్వాలని, దీంతోపాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పేపర్లలో ప్రకటన ఇవ్వాలని ప్రకటన ఇవ్వకుండా కేవలం వార్త రూపంలోనే ఇవ్వడం అది కూడా కేవలం కొన్ని పేపర్లలో ఇవ్వడంతో మున్సిపల్ అధికారులపై అనుమానాలను వ్యక్తమవుతున్నాయి.

వేలంపాటలో పలకని ప్రభుత్వ ధర

- మళ్లీ వాయిదా వేసిన అధికారులు
- అధికారులను నిలదీసిన తై బజార్ కాంట్రాక్టర్లు

నవతెలంగాణ-పిట్లం

తై బజార్ వేలం పాటను ఎన్నిసార్లు వాయిదా వేస్తారని కాంట్రాక్టర్లు అధికారులను నిలదీశారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం పాటను మండల అభివృద్ధి అధికారి, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కమలాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి గాను పిట్లం తైబజార్ వేలంపాట నిర్వహించగా 4గురు కాంట్రాక్టర్లు రూ.2లక్షలు డిపాజిట్ చేసి పాల్గొన్నారు. తై బజార్ పాటకు గ్రామపంచాయతీ సిబ్బంది రూ.50లక్షల సర్కార్ సవాల్ నిర్ణయించగా చతుర్ముఖ పోటీ నెలకొనగా మండల కేంద్రానికి


పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న కాంట్రాక్టర్లు

చెందిన గాజుల పాష రూ.8లక్షల 45 వేలు పాట పాడగా, బాన్సువాడ డివిజన్ కేంద్రానికి చెందిన నాటకారి రాజేష్ రూ.8లక్షల 50 వేలు పాట పాడినప్పటికీ అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర రానందున వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో కాంట్రాక్టర్లు ఆగ్రహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటున్నామని, ఇదివరకే 3సార్లు వాయిదా వేశారని మండిపడ్డారు. గత మూడోసారి నిర్ణయించిన వేలంపాటలో రూ.12లక్షల 85వేల పాట పాడినప్పటికీ అధికారుల అవగాహన రహిత్యంతో మూడుసార్లు వాయిదా వేశారన్నారు. 4వ సారి కూడా వాయిదా వేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. కాగా అధికారులు తై బజార్ వేలం పాటను తిరిగి 29 జూన్ నాటికి వాయిదా వేశారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి బ్రహ్మం, సెక్రెటరీ యాదగిరి, పలు మండలాల కాంట్రాక్టర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ
- కామారెడ్డి పెద్ద చెరువును పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

నీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి ఎద్దడిని నివారించేందుకు కృషి చేస్తానని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీటి సరఫరా ఎప్పటికప్పుడు కామారెడ్డి పట్టణ ప్రజలకి అందించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, గరిగంటి లక్ష్మీనారాయణ, అంజద్, ఇమ్రాన్ మొయినుద్దీన్, కో ఆప్షన్ మాసుల లక్ష్మీనారాయణ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బుర్ర మత్తడి కాలువ పరిశీలన..

కామారెడ్డి పట్టణంలోని బుర్ర మత్తడి కాలువను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలన్నారు. మంచినీటి కాలువను పరిశీలించారు. అలాగే మత్తడి కాలువ పనులు అతివేగంగా చేయాలని మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణమూర్తి, నజీరుద్దీన్, మహమ్మద్ అంజాద్, మమత సాయిబాబా, ఇమ్రాన్ మొయినుద్దీన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


పెద్దచెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రాచీన కట్టడాలు భావితరాలకు తెలియజేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- నాగన్నగారి బావితో పాటు అమ్మఆదర్శ పాఠశాల మరమ్మతు పనులు పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్

ప్రాచీన కట్టడాలను భావితరాలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాగన్న గారి బావిని కలెక్టర్ పరిశీలించారు. ప్రాచీన కట్టడాలను పరిరక్షించడానికి స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ప్రాచీన కట్టడాలను భావితరాలకు తెలియజేయడానికి స్వచ్ఛంద సంస్థలు వాటిని పునరుద్ధరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ద్వారా నాగన్నబావికి


నాగన్నగారి బావిని పరిశీలిస్తున్న కలెక్టర్

వెళ్లడానికి పర్మేషన్ రోడ్డు వేయాలని అధికారులకు చెప్పారు. రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. నాలుగు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి హామీ ద్వారా పూడికతీత పనులు చేపట్టడం ద్వారా బావిలో వర్షపు నీరు నిలిచి సమీపంలోని బోర్లలో భూగర్భజలాలు పెరిగాయని తెలిపారు. పునరుద్ధరణ చేసిన తీరును స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కల్పన రమేష్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం లింగంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. స్లాబు మరమ్మతులు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం పనులు పూర్తయినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని చూశారు. రుచికరమైన వంటలు ఉండాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. మరుగుదొడ్లు, మూత్రశాలను శుభ్రం చేయించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. వారికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న వసతులను, మందులు, సిబ్బంది వివరాలను జిల్లా ఉప వైద్యాధికారి శోభా రాణిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయని, వాటిని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా మార్చాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్పీఓ సురేందర్, ఎంపీపీ గరీబునిస, ఎమ్మార్వో నరేందర్, ఎంపీడీవో నరేష్, మండల విద్యాధికారి రామస్వామి, ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ రాజ్ గిరి, ఎఈ రాకేష్, వైద్యాధికారి హిమబిందు, ఏపీవో అన్నపూర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్

బొల్లారంలో ఇరువర్గాల ఘర్షణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బొల్లారం గ్రామంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామంలో ఇరువర్గాలు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడడంతో ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘర్షణను చెదరగొట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బొల్లారం గ్రామానికి చెందిన గొల్ల పండరి తనకు రావాల్సిన రూ.25వేలు ఇగురం రాజాగౌడ్‌ను అడిగాడు. దీంతో అతను బూతు మాటలు తిడుతూ దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై అతని అన్న ఇగురం యాదగౌడ్‌ను సంప్రదించగా అతను కూడా దాడి చేశాడు. అదేవిధంగా రాజాగౌడ్ ఇంటిపైకి వచ్చి ఇంట్లో ఉన్న ఆడవాళ్ళపై సైతం చేయి చేసుకున్నారు. దీంతో గొల్ల పండరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పండరి ఫిర్యాదు మేరకు ఇగురం రాజాగౌడ్, యాదగిరిగౌడ్, రవిగౌడ్, బబ్లు, అరవింద్, రాజేశ్వర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యచరణపై కార్మిక సంఘం నాయకుల సమావేశం


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే తెరిపించాలని కోరుతూ గతంలో కార్మికులు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీలు ఇచ్చింది. కానీ ఇంతవరకు దాని కార్యచరణ చేపట్టకపోవడంతో గురువారం ఎన్ఎస్ఎఫ్ కార్మిక సంఘం నాయకులు ఫ్యాక్టరీ వద్ద సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ మనుగడ కోసం ఫ్యాక్టరీ పున్నప్రారంభించడానికి చేపట్టవలసిన ఉద్యమాలకై కార్యచరణ రూపొందించడానికి కార్మిక సంఘం నాయకులు సమావేశమై చర్చించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎలా ఉద్యమించాలని, ప్రధాన సమస్యలైన కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, ఫ్యాక్టరీ ప్రారంభం చేసి పూర్వ వైభవం తీసుకు రావడానికి ప్రభుత్వాన్ని కోరడం లాంటి సమస్యలపై చర్చించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి రాగానే హైదరాబాద్ వెళ్లి కార్మికుల సమస్యలను విన్నవించి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని సమిష్టిగా ముందుకు వెళ్లాలని చర్చించారు. ఈ సమావేశంలో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ నాయకులు ఉపేందర్, రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కామారెడ్డి

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ జరగడం దారుణమని, లీకేజీకి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణను కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించి వైఫల్యం చెందిందన్నారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఒక్కో అభ్యర్థి నుంచి సుమారు రూ.30లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు జడ్జీతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జబ్బర్‌నాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సతీష్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్, ఏఐఎ ఫ్డీఐ నాయకులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అనారోగ్యంతో బాధపడుతు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తోట రాజన్నకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎడుమ కాలు పాక్షికంగా తొలగించారని, మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. గురువారం తోట రాజన్న ను మాజీ ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రఘునథన్ రాము తో కలిసి పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్‌తో మాట్లాడి రాజన్న కు మెరుగైన విద్య వైద్యం అందించాలని సూచించారు.

పంటలకు బోనస్ ఇవ్వాలి

- ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. గురువారం జిల్లా నాగారంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐఎంఎస్) జనరల్ కౌన్సిల్ విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 30న ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, పండించిన అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అబ్బయ్య, సంపత్, శంకర్, రామకృష్ణ, రామ్మోహన్ రావు, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.





అధ్వానంగా కాకతీయ కాలువ

- పేరుకుపోయిన నాచు, వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మెండోర

లక్షల ఎకరాలకు సాగునీరందించే పోచంపాడ్ కాకతీయ కాలువ నిర్వహణ అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాల రైతులు కాలువ నీరే తాగునీరుకు వినియోగిస్తారు. కొన్నేళ్లుగా ఈ కాలువ నిర్లక్ష్యానికి గురవుతోంది.

కాకతీయ కాలువలో పేరుకుపోయిన నాచు వ్యర్థాలు తొలగించకపోవడంతో కాకతీయ కాలువకు అధికారుల తీరుపై ఆ ప్రాంత వాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీరు, తాగు నీరు అవసరాలకు ఈ నీరే ఆధారం కావడంతో కాల్వశుద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాలు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా ఈ కాలువ నిర్లక్ష్యానికి గురవుతోంది. రైతాంగానికి వర ప్రదాయినిగా చెప్పుకునే ఈ కాల్వ వ్యర్థాలతో నిండిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరు ఇచ్చే ముందు కాలువలో పేరుకు పో యిన చెత్తా చెదారాన్ని, కుళ్లిపోయిన వ్యర్థాలను శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో తాగునీటి మీద ఆధార పడ్డ కాలువ కింద గ్రామాల ప్రజలు, రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. కాలువను చూసిన వారంతా రోగాల బారిన పడుతామన్న అన్న భయం ప్రజల్లో కలుగుతోంది.

గతంలో కాలువ నీటి కోసం ప్రజలు ఎంతో ఎగబడి స్వచ్ఛంగా ఉంటాయని కాకతీయ ప్రాంత ప్రజానీకం విరివిగా నీటిని తాగునీటిగా వాడుకునే వారు. ఈ కాలువ నీటిని జిల్లాలో దాదాపు ఏడున్నర ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీటిని వినియోగించుకుంటూ తాగునీటికోసం, వివిధ అవసరాలకు వాడుతుంటారు. దీని నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు, నీటి సంఘాలు అంతంత మాత్రంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు దుయ్యబడుతున్నారు. ఈ నీటితో వివిధ రకాల చర్మ వ్యాధులు, పశువులకు జీర్ణ కోశ సంబంధింత రోగాలు వ్యాప్తి చెందుతాయన్న భయం వెంటాడుతోంది. కేవలం సాగు నీరు విడుదల చేసేటప్పుడు గతంలో దుక్కి దున్ని తూడు, గుర్రపు డెక్క వంటివి తొలగించేవారు.

నాచు తొలగించడానికి శాశ్వత చర్యలు తీసుకోవడంలో కార్యాచరణ లోపిస్తోంది. కొన్ని గ్రామాల్లో కాలువ గట్టునే డంపింగ్ యార్డుగా వాడుతున్న పరిస్థితి నెలకొంది. గట్టు మీద పోసిన చెత్త కాలువలో చేరి జలాలను కలుషితం చేస్తున్నాయి. నీటి విడుదల నిలిచిపోగానే కాలువలో ఉన్న చెత్తచెదారం కుళ్లిపోయి అందులోనే ఉండి పోతోంది. మళ్లీ నీరు విడుదల చేశాక ఆ కుళ్లంతా పంట బోదెలు ద్వారా తాగు నీటి చెరువుల్లోకి చేరి దుర్గంధం వ్యాపిస్తోందని, కాలువ మీద ఆధారపడ్డ ప్రజానికం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి చర్యల్లో భాగంగానైనా కాకతీయ కాలువను ప్రక్షాళన చేసి కలుషితంలేని నీటిని అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.


చెత్తతో నిండిపోయిన కాకతీయ కాలువ

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 29న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు హెచ్‌ఆర్‌హెచ్ కంపెని, ఐటీ టవర్, నిజామాబాద్ వారు టెలి కాలర్ ఉద్యోగాల నియామకాలు చేపడుతారని పేర్కొన్నారు. అర్హతలు డిగ్రీ పాసై తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మాట్లాడగలిగే పురుషులకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాద్‌లో ఉద్యోగ మేళ ఉదయం 10.30 నిమిషాల నుండి మధ్యాహ్నం లోపల ఈనెల 29 న పాల్గొనాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కు ఈ ఫోన్ నెంబర్ 9581768413, 9948748428, 6305743423, 9959456793 లకు సంప్రదించాలని, అభ్యర్థులు తమ బయో డేటా, ఆదర్ కార్డు, ఎస్ఎస్ సి మెమో ,ఫోటో తీసుకొనిరాగలరు అని అన్నారు.

తైబజార్ వేలంపాట నేటికి వాయిదా


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన తైబజార్ వేలంపాట నిర్వహించారు. గ్రామంలో 2024-25 సంవత్సరానికి గాను తైబజార్ వేలంపాట నిర్వహించగా నిర్దేశించిన రూ. 2లక్షల 86వేల టార్గెట్ రాకపోవడంతో శుక్రవారంకి వేలంపాటను వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు. రూ.లక్ష 5వేలు మాత్రమే వేలంపాట రావడం మూలంగా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. మరో మారు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగలవారు సకాలంలో హాజరై నిబంధనల మేరకు టెండర్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి, హేతువాది బొజ్జా తారకం


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజల పక్షపాతి, హేతువాది బొజ్జా తారకం నేటి సమాజానికి స్ఫూర్తి కావాలని సిపిఐ (యం -యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాల మహానాడు నగర అధ్యక్షులు దాస్ రాజ్ అన్నారు. బొజ్జా తారకం 85వ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలో శ్రామిక విజ్ఞాన కేంద్రం వద్ద జయంతి సభ తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్, మాల మహానాడు, బుద్ధిష్ట్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బొజ్జా తారకం దళితుల పట్ల వివక్షత, రెండు గ్లాసుల నీళ్ల పద్ధతికి వ్యతిరేకంగా అనేక గ్రామాలు తిరిగి ఉద్యమాలు చేశాడని తెలిపారు. జిల్లాలో అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణం, హక్కుల ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని నాయకుడిగా మంచి రచయితగా జిల్లాలో పేరు పొందాడని అన్నారు. బీడీ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని, నేడు దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. పబ్లిక్ సెక్టార్ మొత్తం ప్రైవేట్ చేస్తున్నారని . రిజర్వేషన్స్ కాపాడుకోవడానికి బొజ్జా తారకం ఉద్యమ స్ఫూర్తి తో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆనంపల్లి ఎల్లయ్య ,ఎడ్ల నాగరాజ్, బట్టి గంగాధర్, పద్మ రావు, రామ్ మోహన్, సూర్యశివాజీ, బంగారు సాయిలు, కాజా మొయినుద్దీన్, నాగయ్య, భూమన్న,సిర్ప లింగం , శివ కుమార్, జన్నారపు రాజేశ్వర్, రాజు, రాజన్న , తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సహజ యోగ మెడిటేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మహరాష్ట్రలోని పూణే కేంద్రానికి సంబంధించిన మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ గురువు పూజ్యశ్రీ కరణ్ ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ సెమినార్ హాల్‌లో యోగా ప్రయోజనాలు, పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఆహారంతోనే ఆరోగ్యం కాపాడుకోవాలని, ఆహారమే ఔషధంగా మార్చుకోవాలని అందుకు ప్రకృతిలో లభ్యమయ్యే పచ్చి ఆహారం, మొలుకలు తీసుకోవాలని మాంసాహారానికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి మాట్లాడుతూ మంచి ఆలోచనలతో ఒత్తిడిని తగ్గించుకోవాలని ఒత్తిడికి దూరంగా ఉండటమే నిజమైన ఆరోగ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తోపాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ధన్‌పాల్ చారిటబుల్ ట్రస్ట్‌ద్వారా పుస్తకాల పంపిణీ


నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధన్ పాల్ లక్ష్మీ భాయ్, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. కోటగల్లి శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాల, దుబ్బ హై స్కూల్‌లలో ధన్‌పాల్ లక్ష్మీ భాయ్, విఠల్ గుప్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఒకటో తరగతి నుండి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ.. ఇందూర్ నగరంలో ఉన్న అన్ని ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలకు తన ట్రస్ట్ ద్వారా ఉచితంగా పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అర్బన్‌లో నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నదే తన లక్ష్యం అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ స్కూల్స్ తో పోటీ పడుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత శిఖిరాలకు ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారని తెలిపారు. భారత దేశ ప్రధాని నరేంద్రమోదీ, సత్య నాదెండ్ల, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇలా ఎందరో ఉన్నత శిఖిరాలు సాధించిన మహానుభావులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. చిన్నప్పటినుండే ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకొని గొప్ప స్థాయికి వెళ్లి తల్లితండ్రులకు, పుట్టిన ఊరుకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, విద్యరంగ సమస్యలను తప్పకుండ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తన ట్రస్ట్ ధ్వారా దుబ్బ హై స్కూల్‌లో విద్యార్థులకు బెంచీలు, ఫర్నీచర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, ఎంఈఓ రామారావు, స్థానిక కార్పొరేటర్ బంటు వైష్ణవి, రాము, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రాంచందర్ గైక్వాడ్, హై స్కూల్ హెచ్‌ఎం వసుదేవరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ వీణ రాణి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మీనారాయణ, టిడిపి ఎఫ్ ప్రెసిడెంట్ సురేష్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు దుబ్బ ప్రభుత్వ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గంగాధర్, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్, మాయవార్ రాజు, మాజీ కార్పొరేటర్ మాయ వారి సాయిరాం, బిజెపి సీనియర్ నాయకులు బద్దంకిషన్, మండల అధ్యక్షులు గడ్డం రాజు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న లైన్‌మెన్



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి ఓ వానరం మృతి చెందింది. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో స్పందించిన లైన్‌మెన్ లక్ష్మణ్ వానరాన్ని విద్యుత్ తీగలపై నుంచి తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం ఇతరులతో కలిసి సాంప్రదాయబద్ధంగా చనిపోయిన వానరాన్ని అంత్యక్రియలు నిర్వహించి తమ మానత్వాన్ని చాటుకున్నాడు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దిష్టి బొమ్మను గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా దహనం చేశారు. తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ న్యూ బాయ్స్ హాస్టల్ ముందు హైదరబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్ హౌస్ ముందు స్టూడెంట్స్ యూనియన్ నాయకులు హక్కుల కోసం నిరసన తెలియజేసి నందుకు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షున్ని మాజీ విద్యార్థి సంఘం నాయకులను, ఎస్ఎఫ్ఐ నాయకులను మొత్తం ఐదుగురిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టుగా యూనివర్శిటీ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ నిరసన తర్వాత విద్యార్థులపైన పోలీసు కేసులు పెట్టడమే కాకుండా విద్యార్థులను యూనివర్శిటీ నుంచి వెలివేస్తు సస్పెన్షన్ నిర్ణయం తీసుకుందని అన్నారు. సస్పెన్షన్ కాబడ్డ ఈ ఐదుగురు చాల నిరుపేద కుటుంబాల నుంచి అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన వారన్నారు. ఈ సస్పెన్షన్‌తో వారి చదువులు, స్కాలర్షిప్ప అన్నీ ప్రశ్నార్థకంలో పడనున్నాయని తెలిపారు. ఇదే యూనివర్సిటీ లో ఎనిమిదేళ్ళ కిందట ఏ విధంగా రోహిత్ వేములను ఇదే రకంగా వెలివేసి ఆయన హత్యకు యూనివర్శిటీ యాజమాన్యం కారణం అయిందో అందరికీ తెలిసిన విషయమన్నారు. యూనివర్శిటీలో ప్రస్తుత పరిస్థితులు ఇదే విధంగా రావడం యూనివర్శిటీలో మళ్ళీ పెరుగుతున్న నిరంకుశత్వాన్ని, అణచివేతను ఎలుగెత్తి చాటి చెప్తున్నాయని అన్నారు. ఇప్పటికైన వెంటనే వారి పై సస్పెన్షన్ నీ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు దినేష్, చిత్రు, అరవింద్, కృష్ణ, రాకేష్, రోషన్, నాయకులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కనీస వేతనం అమలు చేయాలి

- లేకపోతే సమ్మె నోటీసు : బీఎల్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.19,500 అమలు చేయకపోతే సమ్మె నోటీసు ఇస్తామని బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ హెచ్చరించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రకటించిన 30శాతం పీఆర్సీ ప్రకారం జీవో నెంబర్ 60ను అనుసరించి వాటర్ సప్లయ్, గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్ శానిటేషన్, జువాన్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్‌టియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఇంతవరకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రానందున గురువారం జిల్లా కార్మిక శాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్‌టియు జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ సప్లయ్ గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్ కార్మిక సంఘం అధ్యక్షులు రాహుల్, కార్యదర్శి ఎ.హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు జి.యాదయ్య శ్రీశైలం, వసంత్, మురళి, గోపాల్, రాజేశ్వర్, కె.సహదేవ్, కె.సతీష్, కార్మికులు పాల్గొన్నారు.

మాదిగ కుటుంబాల భూమికి రక్షణ కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న దళితసంఘాల నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం మోతే గ్రామానికి చెందిన మాదిగ కుటుంబాల భూమికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం కమ్మర్ పల్లి తహసిల్దార్ కార్యాలయంలో దళిత సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు దళిత సంఘాల నాయకుడు కండే కాంతి కుమార్ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. మోతె గ్రామంలో మాదిగ కుటుంబానికి చెందిన భూమిని గతంలో గ్రామ అభివృద్ధి కమిటీ కబ్జా చేసిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అడ్డుకున్న వారిపై దాడులు చేయడమే కాకుండా గ్రామ బహిష్కరణ చేశారన్నారు. రెండు రోజుల క్రితం పంట భూమిని చదును చేసి పంటను, పంట భూమిలో ఉన్న కంచెను ధ్వంసం చేసిన మోతే గ్రామ అభివృద్ధి కమిటీపై కేసుచేసి మాదిగ కుటుంబాల భూమికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కనగర్తి అశోక్, ఎర్ర రాజు,మేకల శేఖర్, ఏగంటి పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతు పనులు పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని అంబేద్కర్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాల మరమ్మతు పనులను ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి సునీల్ యాదవ్ తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాఠశాలకు ఆర్థికసాయం చేసిన డీఈ పావని

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నీటిపారుదల శాఖ డిఈ జి.పావని బాలికల రక్షణ కోసం రూ.18,300 ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. సుమారు 500 మందిపైగా విద్యార్థినీలు చదువుతున్న ఈ పాఠశాలకు గేటు లేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె ఆర్థికసాయం అందించి ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు బర్దిపూర్ విట్టల్‌తో గేటు పనులను పూర్తి చేయించారు. పావని అమ్మానాన్నల జ్ఞాపకార్థం మేరకు ఆర్థికసాయం అందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు ఆర్థికసాయానికి ముందుకు వచ్చిన పావనికి పాఠశాల విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ నిర్ణయాలు బేఖాతర్

- బాన్సువాడలో గ్రూపులుగా మారిన కాంగ్రెస్ పార్టీ
- సతమతమవుతున్న కార్యకర్తలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ కాంగ్రెస్ రాజకీయాలు ఎప్పుడూ ఆసక్తి రేపుతున్నాయి. ఆ క్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ రాజకీయం ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ స్పీకర్, మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఆహ్వానించడం మేరకు కాంగ్రెస్ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు కొందరు ఆహ్వానిస్తుండగా మరికొందరు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నాలుగు గ్రూపులుగా విడిపోయాయి. ఇందులో పాత కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం, బీఆర్ఎస్ నుండి వలసబోయిన నాయకులు, పోచారం వర్గం లాగా ఏర్పడ్డారు. ఇందులో వలసబోయిన నాయకులు ఏనుగు వర్గీయులు కలిసి పోచారంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం పోచారం సేవలను సద్వినియం చేసుకునేందుకు రాష్ట్రంలో ఉన్నత స్థానం కల్పించేందుకు సిద్ధంగా ఉండగా అలాగే పోచారం భాస్కర్‌రెడ్డికి ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపగా.. బాన్సువాడ నియోజకవర్గానికి కాసుల బాలరాజ్, ఆగ్రో చైర్మన్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, పోచారం భాస్కర్‌రెడ్డికి ఉన్నత పదవులు రావడానికి కొందరు హర్షం వ్యక్తం చేయగా కొందరు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురికి మూడు పదవులు వస్తే బాన్సువాడ మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

ఓ వర్గంలో ఆందోళన..

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి సోదర భావంతో ఉండేవారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జాజాల సురేందర్‌పై ఏనుగు రవీందర్‌రెడ్డి ఓడిపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరి బాన్సువాడ నియోజకవర్గం అభ్యర్థిగా ఏనుగు రవీందర్‌రెడ్డి పోటీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడం, బీఆర్ఎస్ పార్టీలో వర్గ రాజకీయం ఏర్పడడం, ఉమ్మడి జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలో భాగంగా ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు జతకట్టి అవిశ్వాసం పెట్టి డిసిసిబి చైర్మన్ పదవికి రాజీనామా చేసేలా చేయడంతో ఓకే పార్టీలో వర్గ వివేకం బాన్సువాడలో రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఇంతవరకు బాగానే ఉన్నా కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి రావడం పట్ల ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు, బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన కొందరు వలసవాదులు జీర్ణించుకోలేక నిత్యం ఏదో ఒక గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం అది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అధిష్టానికి తలనొప్పిగా మారిందని అదే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పోచారం ధీమా ఇవ్వాలి..

గతంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభ సమావేశంలో మాట్లాడుతూ ఓడలు బండ్లు అవుతాయి బండ్లు ఓడలవుతాయి. మాకు కూడా ఒక రోజు మంచి రోజు వస్తుందని వలసవాదులను దృష్టిలో పెట్టుకొని ఆయన ఆవేశంతో ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని దృష్టిలో పెట్టుకొని పోచారం శ్రీనివాస్‌రెడ్డి నచ్చని వారు కొందరు కాంగ్రెస్ నాయకులు కొందరు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఏదో అవుతుంది, కార్యకర్తలకు నష్టం జరుగుతుంది అనే నినాదంతో ప్రజలను కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారంటూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని కట్టుబడి పార్టీలోకి చేరిన వ్యక్తికి ఆహ్వానించడం వారితో పార్టీ బలోపేతానికి కృషిచేయవలసిన నాయకులు, కార్యకర్తలు విభేదాలు సృష్టించి గ్రూపులుగా మారారు. బాన్సువాడ నియోజకవర్గాల్లో పోచారానికి గట్టి పట్టుంది. కాంగ్రెస్ పార్టీలకు చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పోచారం ధీమా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేపలవేటకు వెళ్లి ఒకరు మృతి



మృతి చెందిన శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

చేపలవేటకు వెళ్లి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని అంబం(వై) గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రఘుపతి శ్రీనివాస్ (35) తన కులస్తులతో కలిసి అంబం గ్రామం సమీపంలో గల పోతాయి చెరువు (ఊర చెరువు)లో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పడుతుండగా.. ప్రమాదవశాత్తు వలకు తట్టుకుని నీటమునిగాడు. ఆయనతో కలిసి వెళ్లిన వారు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా.. అప్పటికే శ్రీనివాస్ మృతిచెందాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన ఆరోగ్య సిబ్బంది



మాట్లాడుతున్న ఆరోగ్య సిబ్బంది

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆరోగ్య సిబ్బంది సందర్శించి, పాఠశాల మేడపైన పరిసరాల పరిశుభ్రత, నీటి నిలువ ప్రాంతం, విద్యార్థులకు అందచేసే తాగునీరు ట్యాంక్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య విషయాలు సిబ్బంది తెలియజేశారు. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో ఈగలు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ట్యాంక్‌పైన తప్పకుండా మూత ఉంచాలని, ప్రతి వారానికి ఒకసారి ట్యాంక్‌ను శుభ్రం చేయాలని తెలియజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల, దోమల వ్యాప్తి, జాగ్రత్తలు పలు విషయాలపైన విద్యార్థులకు అవగాహనా కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కిచెన్ కూడా పరిశీలించారు. విద్యార్థులకు వేడి వేడి ఆహారం అందచేయాలని పలు విషయాలపైన పూర్తిగా అవగాహనా కల్పించారు. చేతుల పరిశుభ్రత పాటించాలని అతిసారా వ్యాధి పట్ల పూర్తిగా అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైసర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది రోజా, శ్రీదేవి, ఆశాలు అనిత, సంగీత, అక్తరీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

- ఎంఈఓకు ఫిర్యాదు



ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ అధిక ఫీజు వసూలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎంఈఓ రామారావుకు విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. ఎడపల్లి గ్రామానికి చెందిన మల్కయ్య తన ఇద్దరు పిల్లలను స్థానికంగా ఓ పాఠశాలలో నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు చదివించి స్కూల్ ఫీజు చెల్లించాడు. పై తరగతిలకు చదివించడానికి ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వ స్కూలులో చదివిస్తానని టిసి, బోనాఫైడ్ ఇవ్వాలని కోరితే సదరు కరస్పాండెంట్ కరోనా కాలంనాటి ఫీజు రూ.7500 చెల్లిస్తేనే టిసి, బోనాఫైడ్ ఇస్తానని తెలిపాడు. దీనిపై తనకు ఎంఈఓ న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎంఈఓ రామారావు ఏదైనా ప్రైవేట్ పాఠశాల స్కూల్ యాజమాన్యం అధిక ఫీజు వసూలు చేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రి పదవి దక్కేనా..?

- వెనుకబడిన ప్రాంతం జుక్కల్
- ఏండ్లయినా.. మంత్రి పదవి దక్కని వైనం

నవతెలంగాణ-మద్నూర్

1956లో జుక్కల్ నియోజకవర్గం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పరిధిలో ఉండేది. భాషా ప్రాతిపదకన 1957లో మహారాష్ట్ర నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి విలీనం చేశారు. అప్పటి నుండి నేటి వరకు జుక్కల్ నియోజకవర్గానికి 57 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని 10 ఏళ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గానీ జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదు.

జుక్కల్ నియోజకవర్గం మూడు రాష్ట్రాలైన ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో ఉంది. ఈ మూడు రాష్ట్రాల సరిహద్దులో గల వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదు. మంత్రి పదవి వస్తే జుక్కల్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యేలు మంత్రి హోదాలో అభివృద్ధి సాధిస్తారని నియోజకవర్గం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయినా వారి ఆశలు ఇంతవరకు నెరవేరడం లేదు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాషా ప్రాతిపదికన కలిపిన నాటినుండి నేటి వరకు 67 ఏళ్ల గడిచాయి. 57 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జుక్కల్ నియోజకవర్గం కొనసాగినప్పటికీ ఆ 57 ఏళ్ల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా.. జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదు. ప్రత్యేక రాష్ట్రంలోనూ పదేండ్లు పాలన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ మంత్రి పదవి దక్కలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలోనైనా జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తే తమ నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ నియోజకవర్గంలో దళితులు అభివృద్ధి చెందడానికి 1978లో జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కాన్స్టెన్సీగా ఏర్పాటు చేశారు. ఎస్సీ రిజర్వుడు ఏర్పడి 46 సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి ఏమాత్రం లేదు. ప్రస్తుతం జుక్కల్ శాసన సభ్యులుగా తోట లక్ష్మీకాంతరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన మంచి విద్యావేత్త అనే అభిప్రాయం ఉంది. ఇలాంటి వ్యక్తికి మంత్రి పదవి కట్టబెడితే వెనుకబడ్డ ప్రాంతం అభివృద్ధికి ఎంతో కృషి జరుగుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇచ్చేలా నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరంలో ఉచిత సేవలందించిన వైద్యులు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఏద వర్షిప్ సెంటర్ చర్చ్ మైదానంలో గురువారం యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ ద్వారా ఏద వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎల్లారెడ్డి చుట్టుపక్కల ఉన్న వివిధ గ్రామాల ప్రజలు అనేకమంది వచ్చి వారి అనారోగ్యానికి సంబంధించి శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లను సంప్రదించడంతో ఉచితంగా చికిత్స చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు, కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి సామెల్, ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్ వాసికి రాష్ట్రస్థాయి పురస్కారం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల డెయిరీ కళాశాలలో గురువారం సమాచార హక్కు చట్టం రాష్ట్ర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి, ఆర్టిఐ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎసలీం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాజన్న, రాష్ట్ర డైరెక్టర్ సలీం మాట్లాడుతూ.. బీబీపేట్‌కు చెందిన కొంగరి ఎం.నాంపల్లి సమాజానికి చేసినటువంటి నిస్వార్థ సేవలను గుర్తించి ఆర్‌టీఐ చట్టం పట్ల అవగాహన కల్పించుట, విద్యాహక్కు చట్టంపై అవగాహన, బాల్యవివాహాల నిర్మూలన చట్టం గూర్చి, సైబర్ క్రైమ్ నేరాల గూర్చి అవగాహన కల్పించుట, చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అవగాహన కల్పించుట వంటి అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేసినందుకుగానూ ఆర్టిఐ రాష్ట్ర కమిటీ తరఫున బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును ప్రదానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ షబానా బేగం, శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న కొంగరి నాంపల్లి

జూలై 3తో ముగియనున్న ఎంపీటీసీల పదవీకాలం

- రాబోతున్న మండల ప్రత్యేకాధికారుల పాలన



నవతెలంగాణ-మద్నూర్

వచ్చే నెల జూలై 3తో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుంది. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగిసి నెలలు గడుస్తున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇక జులై 3తో ఎంపీటీసీల పాలన ముగియనుండడంతో వారి స్థానాల్లో కూడా మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించడానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. మండలానికి ప్రత్యేక అధికారిగా కామారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ నియమితులైనట్లు తెలుస్తోంది. పంచాయతీలకు సర్పంచుల పదవి కాలం ఫిబ్రవరి మాసంతో ముగిశాయి. ఎంపీటీసీల పదవి కాలం జూలై 3తో ముగుస్తుంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలననే కొనసాగనుంది.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దాం

- ఏపీఎం రాజారెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు కృషి చేద్దామని ఏపీఎం రాజారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఇన్స్‌ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.పి.యం రాజారెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులు, యువత, ప్రజలు ఎలా ఇబ్బందులకు గురవుతున్నారో అవగాహన పెంచడంతో పాటు, ఈ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన చర్యలను వివిధ ప్రభుత్వ శాఖలు చేపడుతున్నా.. మనం అందరం సమిష్టిగా ఎదుర్కోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఐ.యస్.ఆర్.డి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేంధర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా మన సమాజానికి అనేక రకాల సమస్యలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇది వ్యక్తుల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుందని వివరించారు. సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని చెప్పారు. మాదకద్రవ్యాల వాడకం, అక్రమ రవాణా వల్ల కుటుంబాలకు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఒకప్పుడు పెద్ద నగరాలలో ఈ సంస్కృతి ఉండేదని, ప్రస్తుతం మన గ్రామానికి మన వాడకు మన ఇంటిలోకి వచ్చిందని, ఆదిలోనే మాదక ద్రవ్యాల వినియోగం ఆపకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించడానికి, వాటి అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి సమన్వయంతో డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని తెలిపారు. మాదకద్రవ్యాల వాడకం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అందరం కలసికట్టుగా పోరాడుదామని, మన సమాజాన్ని సురక్షితంగా ఆరోగ్యవంతంగా ఉంచేందుకు కృషిచేద్దామని అన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేసి అధ్యక్షులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఐ.యస్.ఆర్.డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి విఠల్ రావు, సిసిలు ఆంజనేయులు, రాములు, నరేందర్, లింగం, సౌజన్య, కృష్ణాంజలి, పర్యవేక్షణ సమాఖ్య సిబ్బంది లత, గ్రామ సంఘాల అధ్యక్షులు సిబ్బంది పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న సలీం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల సిద్ధార్థ జూనియర్ కళాశాలలో గురువారం 2005 సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సమాచార హక్కు చట్టం 2005 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గేలా రాజు తెలిపారు. ఈ సందర్భంగా సహచట్టం రాష్ట్ర డైరెక్టర్ మాజీ న్యాయమూర్తి సలీం హాజరై చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అక్టోబర్ 12, 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, దానికి సంబంధించిన సెక్షన్లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సాహిల్ ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు బేర్జానా బేగం, జిల్లా సలహాదారులు లింగమయ్య, మదర్ పాష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మెండోర

బుస్సాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముప్కాల్‌కు చెందిన పాండురంగ బుక్‌డిపో యజమాని పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు గురువారం ఇంగ్లీష్, తెలుగు బుక్స్‌ను అందజేశారు. పాండురంగ బుక్‌డిపో యజమాని రామరాజ్, ఉమేష్‌లను పాఠశాల తరపున కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్స్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు



కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ స్కాలర్స్ పాఠశాల యందు విద్యార్థులకు చదువుతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ తాళ్ల వేణు, ప్రిన్సిపాల్ గుమ్మాల ఓడ్డెన్న గురువారం తెలిపారు. ఇంగ్లీష్, గణితం, సైన్సు ఇతర సబ్జెక్టులలో నైపుణ్యం లేని వారిని గుర్తించి, వారికి వైస్ ప్రిన్సిపాల్ సహస్ర, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. చదువుతూ పాటు వ్యాయామం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్టు తెలిపారు.

జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షునిగా సుంకే శ్రీనివాస్



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్టు కాలని అభివృద్ధి కమిటి అధ్యక్షులుగా సుంకె శ్రీనివాస్ ను కమిటీ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని, స్వచ్ఛ కాలనీ - సమైక్య కాలనీ అనే కార్యక్రమం ద్వారా చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని యదాతదంగా కొనసాగిస్తానని తెలిపారు. కాలనీ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తానని అన్నారు కాతనా అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి అధ్యాపకుల దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాల్కొండ 2024- 25 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాలస్వామి పేర్కొన్నారు. అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 28నుండి 02.07.2024 వరకు గడువు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

సాధారణ అభ్యర్థులకు కనీస అర్హతలు పీజీలో ఉత్తీర్ణత శాతం 55శాతం మార్కులు కలిగిన వారు దరఖాస్తులకు అర్హులని తెలిపారు. నెట్, స్లెట్ పీహెచ్‌డీ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు. బోధన అనుభవం గల అభ్యర్థులకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వబడునని, కావున అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పీజీలో 50శాతం ఉత్తీర్ణత శాతం ఉంటే సరిపోతుందని అన్నారు. ఖాళీల వివరాలు: తెలుగు -1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-1, ఎకనామిక్స్ -1, పోస్టులు కలవని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మోపాల్ గ్రామస్తులు



ఎమ్మెల్యేను సన్మానించిన మోపాల్ గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కురుమ సంఘం కుల పెద్దలు, గ్రామస్తులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. బీరప్ప దేవాలయ అభివృద్ధికి, గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డిడబ్ల్యూఓ రసూల్‌బి



మాట్లాడుతున్న డిడబ్ల్యూఓ రసూల్ బీ

నవతెలంగాణ-ఆర్మూర్

అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిడబ్ల్యూఓ రసూల్ బి.అన్నారు. పట్టణంలోని అంగన్వాడి టీచర్లకు ఈసీసీఈ శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు నుండి ఆరు సంవత్సరాల వయస్సు పునాది దశ అని, మనం వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అంగన్వాడి కేంద్రాల్లోనూ ఇంటి వద్ద అందించాలని, ఈ దశలో పిల్లలకు చదువు నేర్పిస్తే భవిష్యత్తులో వారు పౌరులుగా తయారవుతారని అన్నారు. అంగన్వాడి సెంటర్లలో హాజరు శాతాన్ని పెంచాలని, నూతన జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులు, సవరించిన అంశాలను టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ సిడిపిఓ జ్యోతి, మాస్టర్ ట్రైనర్స్ రేఖ, శ్రీదేవి సూపర్వైజర్లు వెంకట రమణమ్మ, నలిని, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా గైని గంగారాం బాధ్యతల స్వీకరణ



సన్మానించి బొకేను అందజేస్తున్న పలుసంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీటిపారుదల శాఖ నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ కార్యాలయ సూపరింటెండెంట్‌గా గైని గంగారం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డిఈఈ ఖీమ్యా నాయక్‌ను కలిసి ఆయన జాయినింగ్ లెటర్ అందించారు. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయ నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన గైని గంగారంను ఇరిగేషన్, డీఎంహెచ్ఓ, ఎక్సైజ్, జడ్పీ, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఎస్పి సర్కిల్, టీజీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు విజయ్, తెలంగాణ ఎంఆర్పిఎస్ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు నాంపల్లి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వైఆర్ డేవిడ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రావు, జిల్లా నాయకులు శంకర్, బీసీ సంఘం నాయకులు శంకర్, కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ సంఘాల పక్షాన శాలువా కప్పి సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో రాజకీయ జెఎసి జిల్లా కన్వీనర్‌గా, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా గైని గంగారం చేసిన కృషిని గుర్తు చేసి ప్రశంశలు కురిపించారు. ప్రస్తుతం టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్న గైని గంగారం రానున్న రోజుల్లో మరింతగా ఎదగాలని, ఉద్యోగంలో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. తనపై అభిమానంతో తనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి గైని గంగారం ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

రైతుల భూమిపైన కబ్జాదారుల కన్ను

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులోని 246 సర్వే నెంబర్‌లో గత కొన్ని ఏళ్ల నుండి రైతులు ఈ భూమిలో కబ్జాలో ఉండి, భూమి పట్టా కోసం ఎన్నో పోరాటాలు చేశారని, గతంలో ముఖ్యమంత్రి గా ఉన్న దివంగత రాజశేఖర్‌రెడ్డి ఉన్నపుడు 4 వ విడత భూ పంపిణీలో భాగంగా వారికి భూమికి పట్టాలు ఇవ్వడం జరిగిందని ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు దేవస్వామి, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వి.సాయినాథ్ లు అన్నారు. గురువారం రైతులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనాటి నుండి నేటి వరకు వారు భూమి చదును చేసుకొని అందులో బోర్లు వేసుకొని పంట పండిస్తున్నారని వివరించారు.

ఈనాటికి వారు కబ్జాలోనే ఉన్నారని, వారి భూమికి పట్టాలు సైతం ఉన్నాయని కానీ ఈరోజు మాకు తెలియకుండా ఎవరో వచ్చి సర్వే చేస్తున్నారనే సమాచారం మేరకు అ భూమి వద్దకు వెళ్లి వారిని అడిగితే పల్లె సాయికుమార్, పల్లె శ్రీనివాస్ తమకు ఈ భూమిని అమ్మారని అన్నారు. వారు కొన్ని ఏళ్ల నుండి పంట పండిస్తున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుప్రియ, సాయిలు, లక్ష్మి, గంగామణి, చిన్న ఒడ్డెన్న, సావిత్రి, రాజమణి శాంతా, పోసాని, కర్రెవ్వ, పోసాని, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, పట్టాలు చూపుతున్న లబ్దిదారులు



కార్తీక్ నాయక్‌ను సన్మానించిన పలువురు

యువ కవి రమేష్ కార్తీక్ నాయక్‌కు
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం

- సన్మానించిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

యువ కవి రమేష్ కార్తీక్ నాయక్‌కు కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని వివేక్ నగర్ తండా వాసి బంజారా యువ కవి రమేష్ కార్తీక్ నాయక్ ని జిల్లా అధ్యక్షులు చంద్రు నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారాచంద్ నాయక్ గార్ల ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా నాయకులతో కలిసి సన్మానించారు. రమేష్ కార్తీక్ నాయక్ హైదరాబాద్ నుండి వచ్చిన విషయం తెలిసి గురువారం జిల్లా బంజారా నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి సన్మానించారు. చిన్న వయసులోనే 4 పుస్తకాలు రాశారని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు చంద్రు నాయక్ మాట్లాడుతూ డావలో పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం అవార్డు రావడం జిల్లా,రాష్ట్ర బంజారా సమాజం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఇంకా ఇలాంటి అవార్డులు తెచ్చుకుని బంజారా సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని కోరారు. బంజారా యువ కవి రమేష్ కార్తీక్ నాయక్‌కు జిల్లా బంజారా సేవా సంఘం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కొర్ర గంగాధర్ నాయక్, మండల బంజారా అధ్యక్షులు, విట్టల్ రాథోడ్ జిల్లా కార్యదర్శి, రాజు సదర్ నాయక్, జితేందర్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ జక్రాన్‌పల్లి, మదన్ నాయక్ మండల ప్రధాన కార్యదర్శి డిచ్‌పల్లి, గ్రామ నాయకులు రమేష్ కార్తీక్ నాయక్ తండ్రి మోజీరామ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలం లోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ -1, అసిస్టెంట్ కుక్ -2 పోస్టుల భర్తీ కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జి. సవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత 10వ చదివి ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును 28 నుండి 02 జూలై సాయంత్రం 5:00 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మోడల్ హాస్టల్ (గర్ల్స్)హాస్టల్ లో అసిస్టెంట్ కుక్ -1 డిచ్ పల్లి మండలం లోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న మోడల్ హాస్టల్ (గర్ల్స్)హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ -1పోస్టు భర్తీ కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జి. సవిత, మోడల్ హాస్టల్ (గర్ల్స్) వార్డెన్ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండయా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు మూగ ప్రభాకర్ అన్నారు. పట్టణంలో ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందిపేట్ పొలిమేరలోని 630 /1 సర్వే నెంబర్‌లోని ఎకరం 20 గుంటల భూమిని ఆర్థికంగా వెనుకబడిన వారిని లబ్ధిదారులుగా గుర్తించి, తహసిల్దార్ ప్రొసీడింగ్ నెంబర్ ఏ 2/3992/04 లోద్వారా ప్రభుత్వ భూమిని లబ్ధిదారులకు అసైన్మెంట్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. లబ్ధిదారులు వారికి కేటాయించిన ప్లాట్లలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న తరుణంలో అక్కడే ఉంటున్న కొందరు భూ ఆక్రమణదారుల ఈ భూమిని ఎలాగైనా కబ్జా చేయాలని దురాశతో వీరిని ఇబ్బందులకు గురిచేస్తూ మీరు వేసిన గుడిసెలను పీకి వేస్తూ అక్కడ నుంచి వెలగొట్టారని అన్నారు. పట్టాదారులందరూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఈ భూమిపై విచారణ జరిపించి 2004లో ప్రభుత్వం అసైన్మెంట్ పట్టాలు ఇచ్చిన లబ్దిదారులకే చెందుతాయని అన్నారని తెలిపారు. నెంబర్ ఎ 3/892/2020 తేదీ 01-4-22 నాడు స్థలాలను సంబంధిత లబ్దిదారులకు స్వాధీన పరిచారని అన్నారు. లబ్దిదారులు వారి జాగాలలో గుడిసెలు వేస్తే వాటిని తీసి వేయించారని, అయితే మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆర్డిఓ ఆర్మూర్, ఏసీపి ఆర్మూర్, ఎమ్మార్వో నందిపేట విచారణ అధికారులుగా నియమించారని తెలిపారు. వారిద్వారా భూ అక్రమణదారులను తొలగించి పట్టాదారులకు భూమిని స్వాధినపరచమని ఆర్డర్ జారీ చేశారన్నారు. దీనిలో రాజకీయ నాయకులైన కుమ్మరి చిన్నయ్య లక్కంపల్లి, ఎక్స్ ఎంపీటీసీ-2) పసుపులేటి రవికుమార్, కుమ్మరి సాగర్ నందిపేట్, సోడాల రాజు, పాలరాజు గుడిసెలను తీపి వేస్తూ ఈ భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని తెలిపారు. దీనిపై నందిపేట్ ఎస్సై, ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోలేదని వాపోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడ ఉంటున్న వారికి ప్రభుత్వం కేటాయించిన ఆసైన్ మెంట్ పట్టాల భూములను స్వాధీనపరిచి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఒకవేళ అధికారులు స్పందించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని రాష్ట్రవ్యాప్త సమస్యగా మారుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు తన్నీరు గంగామణి, మురుకుల సురేఖ, అరిగే ధనలక్ష్మి, వాణి వెంకటేష్, లలిత ధర్మపురి, మేకల లక్ష్మి, నిక్హత్ పర్వీన్ బేగం, అహ్మద్ బి, నఫీస్ బేగం, గోరిమ ఫారుక్, ఫర్జానా బేగం, యూసుఫ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన
ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, సురేందర్. మాధవ రెడ్డి లకు ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి. ఉపాధ్యాయుల బందం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు చేతన కుమారి మాట్లాడుతూ.. చేపూర్ స్కూల్లో వీరు సుమారు 11 సంవత్సరాలు విధులు నిర్వహించడం చాలా గొప్ప విషయమని వారి సేవలను కొనియాడారు అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ.. చేపూర్ స్కూల్‌లో పనిచేసిన నన్ని రోజులు మాకు సహకరించిన. చేపూర్ గ్రామస్తులకు తోటి ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు కతజ్ఞతలు తెలిపారు.

అలాగే గ్రామ వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు సారంగి శాంతి కుమార్. న్యాయవాది చరణ్ మాట్లాడుతూ.. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత మనం గౌరవంగా భావించే వ్యక్తి గురువు అని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు మన అభివద్ధికి తమ వంతు సహాయం చేస్తారని, వారు చెప్పే పాఠాలు వింటూ మనం ఎదుగుతామని తెలిపారు. కేవలం పాఠాలు మాత్రమే కాదు జీవిత పాఠాలను సైతం నేర్పించి ముందుకు నడుపుతారాని వారు కొనియాడారు. గ్రామ మాజీ సర్పంచ్ ఇందూరు సాయన్న మాట్లాడుతూ.. మనం ఏ స్థాయికి ఎదిగిన మనకు విద్య నేర్పిన గురువులను గుర్తు పెట్టుకుంగిమని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, గంగాధర్, రవి, వినోద్, మహేందర్, చంద్రకళ, ఈ పోచన్న, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మినుగు శిరీష, విడిసి సభ్యులు, ఎంపిటిసి బాలనర్సయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మహనీయుల చారిత్రాత్మక పుస్తకాలు, డిక్షనరీలు, ఆధ్యాత్మిక పుస్తకాలు విద్యార్థుల అవసర నిమిత్తం లైబ్రరీకి, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్స్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవడానికి విద్య, క్రమశిక్షణ, దేశం పట్ల గౌరవం, సేవా భావం విద్యార్థి దశ నుంచే అలవర్చు కోవాలని, నేటి ప్రాజెక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరించిన పట్వారి తులసికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి పాఠశాలకు తమ వంతు సేవలు అందించాలన్న దక్పథం చాలా గొప్పదని, రోటరీ సేవలు స్ఫూర్తిదాయకమని వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ మాజీ అధ్యక్షుడు పుష్పకర్ రావు, ప్రవీణ్ పవర్, దామోదర్, ఆనంద్, ఉపాధ్యాయులు భూమేశ్వర్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలకేంద్రంలో విద్యుత్ అంతరాయం

- ఇబ్బందుల్లో రైతులు, ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది



విద్యుత్ సరఫరాను పునరుద్దరిస్తున్న విద్యుత్ సిబ్బంది

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలో గురువారం విద్యుత్ అంతరాయం కలిగింది. డిచ్ పల్లి నుండి సరఫరా అయ్యే లైన్‌లో సమస్య రాగ విద్యుత్ అంతరాయం కలిగినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. మధ్యాహ్న సమయంలో సుమారు మూడు నుండి నాల్గు గంటలు నిలిచిపోవడంతో గ్రామ రైతులు, వ్యాపారావేత్తలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు విద్యుత్ సిబ్బంది శ్రమించి అంతరాయన్ని తొలగించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్పోర్ట్స్ స్కూల్ నందు 4వ తరగతి లో అడ్మిషన్లకు 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి అయ్యారని జిల్లా క్రీడాల అధికారి తెలిపారు. వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ స్పోర్ట్స్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ ఆదిలాబాద్, కరీంనగర్, హకీం పేట్ స్పోర్ట్స్ స్కూల్ నందు 4 వ తరగతిలో అడ్మిషన్ కొరకు జిల్లా స్థాయి సెలెక్షన్స్ ఈనెల 27న రాజారాం స్టేడియం, నాగారాం, నిజామాబాద్ నందు జరిగిన సెలెక్షన్స్ నందు బాలురు 16, బాలికలు 9 మొత్తం 25 మంది పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన బాలురు, బాలికలను ఎంపిక చేసి 08 జూలై నుండి 12 జూలై వరకు జరుగు రాష్ట్ర స్థాయి ఎంపికల కొరకు వీరిని పంపడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు.

గంపలతో ఊరేగింపు



గంపలతో ఊరేగింపుగా వస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన కురుమ సంఘం సభ్యులు గురువారం గంపలతో ఊరేగింపు నిర్వహించి ముత్తడి పోచమ్మ ఆలయం వద్దకు డోలు సప్పులతో తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బైరయ్య, శంకర్, సంగమేశ్వర్ మహిళలు తదితరులున్నారు.

నాగిరెడ్డిపేటలో ముగిసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ముగిసిందని మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ గురువారం తెలిపారు. గత గురువారం ప్రారంభించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నేటికి ముగిసిందని మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 6,647 మంది ఉండగా గత గురువారం 5,916 మందికి మాత్రలు వేసినట్టు తెలిపారు. మిగతా వారికి గురువారం వేసినటుట పేర్కొన్నారు. 99.9% లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ధ్యానంతో మానసికి ఒత్తిడిని తగ్గించవచ్చు



నవతెలంగాణ-నిజమాబాద్ సిటీ

శ్రీ మాతాజి నిర్మలాదేవి అనుచరులు ఉచిత సహజయోగ ధ్యాన శిక్షణ శిబిరం స్థానిక విజయ్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడిని తొలగించవచ్చని, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మనోధైర్యం మెరుగుపడి వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని విద్యార్థులకు సూచించారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా చెడు అలవాట్లకు దూరం కావచ్చని వారు సూచించారు. ఈ శిబిరంలో పాఠశాల కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ విజేత పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు శిక్షణ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆసియా

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని రైతు వేదికలో 5 మండలాల అంగన్వాడీ కేంద్రాల టీచర్లకు సిడిపిఓ జానకి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆసియా అంగన్వాడీ టీచర్లకు పూర్వ బాల్య దశ ఎదుగుదలపై, పిల్లలకు బోధించే పుస్తకాలపై సూచించారు. అంగన్వాడీ సెంటర్లు పిల్లల ఎదుగుదలకు ముఖ్య పునాదులుగా ఉండాలని అన్నారు. పిల్లల మెదడుకు మేత పెట్టే పాఠ్యం చిన్న దశ నుంచే బోధించాలని అన్నారు. పునాది గట్టిగా ఉంటే మంచి ఇల్లు నిలబడుతుందని, అలాగే 0-8 సంవత్సరాల వయస్సు నుంచి పిల్లలు అంగన్వాడీ సెంటర్లలో టీచర్ బోధన అలా ఉండాలని అన్నారు. వారి ఎదుగుదల అంగన్వాడీ సెంటర్ నుంచే ప్రారంభం కావాలని శిక్షణలో తెలిపారు. కోటగిరి, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల టీచర్ల ఈ శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జానకి, సూపర్‌వైజర్లు రాధలక్ష్మి, మణి, వనజ, మమత, సెకటర్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుల్లాలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో లయన్స్ క్లబ్ బోధన్ వారి సహకారంతో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విట్టల్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు



కారును తనిఖీచేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై స్థానిక టోల్ ప్లాజా వద్ద జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల గ్లాసులకు బ్లాక్ పేపర్ తొలగించి సరైన వాహన పత్రాలు లేని 30 వాహనాలపై కేసు నమోదు చేసి 60 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారు యజమానులు వాహనాలు నడుపుతున్న సమయంలో అద్దాలకు బ్లాక్ పేపర్ ఉండవద్దని, సరైన వాహన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ విక్రయానికి టెండర్ దాఖలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా ఆస్పత్రిలో ఉన్న స్క్రాప్ విక్రయానికి టెండర్ దాఖలు చేయడానికి జూలై 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు టెండర్ ఫారములను విక్రయించనున్నట్టు, ఆసక్తి కలవారు టెండర్ ఫారంలను బోధన్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్లో పొందాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40వేల నగదు అపహరణ
- ఆచన్‌పల్లిలో ఘటన
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని ఆచనిపల్లిలో తాళం వేసిన ఇంట్లో తాళం ధ్వంసం చేసి దొంగలు చోరీకి పాల్పడినట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆచన్‌పల్లికి చెందిన సోమ నాగచంద్రరెడ్డి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మే 23వ తేదీన ఆచన్‌పల్లి నుంచి సోమ నాగచంద్రరెడ్డి తల్లి నాగలక్ష్మమ్మ ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కొడుకు సోమ నాగచంద్రరెడ్డి దగ్గరికి వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇదే అదనుగా భావించిన దొంగలు గేటు తాళం ధ్వంసం చేసి ఇంట్లో ప్రవేశించి, బీరువా తాళాలు పగలగొట్టి 12 తులాల బంగారం, 30 తులాల వెండి, 40 వేల నగదును దొంగిలించుకుపోయారు. అయితే జూన్ 26వ తేదీన ఇంటికి వచ్చిన తల్లి, కుమారుడు వారి ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగిందని నిర్ధారించారు. వెంటనే బోధన్ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ పట్టణ సీఐ వీరయ్య ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా దొంగలు చోరీకి పాల్పడుతున్న తీరు అక్కడే సీసీటీవీలో దృశ్యాలు రికార్డు అయ్యాయి.

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి బ్రహ్మంగారి గుడి విషయమై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశామని ఆలయ కమిటీ అధ్యక్షులు సుంకం భూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో. ఉపాధ్యక్షులు రమణ చారి, సంఘం అధ్యక్షుడు మంచిర్యాల స్వామి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాలింతలకు అవగాహన



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం బాలింతలకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి మెడికల్ ఆఫీసర్ యేమిమా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించడానికి డెలివరీ కాగానే పిపిఐ యుసిడి వేయించుకోవడం వలన తల్లికి సురక్షితంగా ఉంటుందని అన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం ఉండేటట్లు చూడడం ద్వారా తల్లి ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని సూచించారు. ప్రతి బాలింత తల్లులు వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికార కేంద్రం కోఆర్డినేటర్ శిరీష, హెచ్ఈవో వెంకట్ రమణ, సూపర్వైజర్లు దీవెన, స్టాఫ్‌నర్సులు శ్యామల, చైతన్య, బాలింతలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులో పేరు మాయం

- రుద్రూర్ గ్రామ పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యం
- నివ్వెరపోయిన ఇంటి యజమాని
- అధికారులకు ఫిర్యాదు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

రుద్రూర్ మండలం రుద్రూర్ గ్రామ పంచాయతీలో వంజరి మారుతి రావు పిరాజీ ఇల్లు నంబర్ 1-82లో గల ఇంటి యజమాని పేరును పంచాయతీ కార్యదర్శి మాయం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మధ్యలో ఇంటి యాజమాని వంజరి మారుతి రావు ధ్రువీకరణ పత్రం కోసం రుద్రూర్ గ్రామ పంచాయతీకి వెళ్లగా ఆ ఇంటి గల నంబర్ రిజిస్టర్‌లో లేదని వంజరి గంగామణి, వంజరి ప్రభాకర్ పేర్లు ఉన్నాయని తెలుసుకొని నివ్వెరపోయారు. 2021-22లో గంగామని, ప్రభాకర్ అద్దెకు ఉండేవారని మారుతి రావు వెంటనే పంచాయతీ పై అధికారులకు ఫిర్యాదు చేశారు. గత 2021-22లో తన పేరున ఉన్న ఇల్లును తన ప్రమేయం లేకుండా ఇతరుల పేర్లు ఉన్నాయని ఇందుకు పంచాయతీ సెక్రటరీ, ఇతరులు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇదే 2021-22లోనే రిజిస్టర్‌లో వంజరి గంగామణి, ప్రభాకర్ పేర్లు ఎక్కిచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో తన పేరు వంజరి మారుతిరావు ఉందని, ఆన్‌లైన్‌లో తన పేరు లేకపోతే తన ఇల్లును అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని వంజరి గంగామణి, ప్రభాకర్ ప్రయత్నం చేశారని అందుకు పంచాయతీ కార్యదర్శి సహకరించారని పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఫిర్యాదు చేశారు. 2021-22 సంవత్సరంలో విధులలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మారుతిరావు కోరారు. తనకు తెలియకుండా పన్నాగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాద బీమా పాలసీ చెక్కు అందజేత



చెక్కు అదజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించిన కొండల్ రెడ్డి కుటుంబానికి ప్రమాద బీమా పాలసీ చెక్కును నిజామాబాద్ డివిజన్ ఎస్ఎస్‌పిఓఎస్ జనార్దన్ రెడ్డి, ఐపీ కామారెడ్డి సబ్ డివిజన్ సుజిత్, కామారెడ్డి ఐపిపిబి మేనేజర్ పవన్ రెడ్డి, భిక్కనూరు సబ్ పోస్ట్‌మాస్టర్ రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన కొండల్‌రెడ్డి పోస్ట్ ఆఫీస్‌లో టాటా ఏఐజి 399 ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించుకున్నందున కొండల్‌రెడ్డి మరణించిన తర్వాత ఇన్సూరెన్స్ కంపెనీ నుండి వచ్చిన 10 లక్షల రూపాయల ప్రమాద బీమా పాలసీ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని సూచించారు. ప్రతి ఒక్కరు తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రమాద బీమా పాలసీని పోస్ట్ ఆఫీస్‌లో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్, బీబీపేట్, దోమకొండ, జంగంపల్లి పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేపట్టాలి

- పెండింగ్ కేసులను పరిష్కరించాలి
- ఎస్పి సింధు శర్మ



మాట్లాడుతున్న ఎస్పీ సింధుశర్మ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో గల పెండింగ్ కేసులను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. బుధవారం రాత్రి ఎల్లారెడ్డి డి.ఎస్.పి కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడేలాగా చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. డివిజన్ పరిధిలో చోరీలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డి.ఎస్.పి శ్రీనివాసులు, సిఐలు రవీందర్ నాయక్, సంతోష్ కుమార్, ఎస్ఐలు మహేష్, రాజు, చైతన్యకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన నవ్య ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా 2 లక్షల రూపాయల చెక్కును మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, ఎంపీటీసీ సాయిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, నాయకులు, పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ సుధీర్‌రావు, టాస్క్ ఫోర్స్ అధికారులు కలిసి రైడ్ చేయగా ఏడుగురు పేకాట రాయుళ్లను గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 10,350 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అలుగు తూమును పరిశీలించిన అధికారులు



తూమును పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్పల్లి గ్రామంలో గల ఊర చెరువు అలుగు తూము ధ్వంసం కావడంతో దానిని మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని గత వారం క్రితం ఆ గ్రామ రైతులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించారు. వారి సమస్యకు స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులను అలుగు తూము పరిశీలించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ ఊట్పల్లి ఊరచెరువు ఊలుగు తూమును పరిశీలించారు. తూము నిర్మాణ పనులను మూడు రోజుల్లో ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ రైతులకు హామీనిచ్చారు. తూము నిర్మాణం పనులకు సహకరించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఊట్పల్లి గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

- డిఆర్‌డిఓ పిడి చందర్ నాయక్



సమావేశంలో పాల్గొన్న మహిళాసంఘాల సభ్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మహిళా సంఘాలు ప్రణాళిక ప్రకారం రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఓ పిడి చందర్ నాయక్ మహిళా సంఘాలకు సూచించారు. గురువారం మండలంలోని ఫామ్‌ఫండ్‌ను పరిశీలించారు. రైతులు ఫామ్‌ఫండ్‌లను ఏర్పాటు చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. అంగన్వాడీలను పరిశీలించి, కిశోర బాలలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఐకెపిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. రెండో విడత పాఠశాల విద్యార్థులకు ఐకెపి ద్వారా ఏకరూప దుస్తుల కుట్టుటను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సవితారెడ్డి, ఏపిఓ ప్రసన్న కుమార్, సీసీ భూమాగౌడ్, ప్రతాప్, దుర్గాదాస్, శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

అన్ని దానాల్లోకెల్ల రక్తదానం మిన్న అని, ఒక వ్యక్తి రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న నలుగురు వ్యక్తులను ఆదుకోవచ్చని ఆర్మూర్‌లోని స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదరి స్వామి పేర్కొన్నారు. మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన పాత్రికేయుడు ఆర్.రమేశ్ ఆర్మూర్ లోని స్వామిబాహి బ్లడ్ ఫౌండేషన్ కు ",ఏ పాజిటివ్ " రక్తాన్ని డొనేట్ చేయడం జరిగిందన్నారు. సమాజ హితంతోపాటు సామాజిక సేవ రంగంలో కూడా పాత్రికేయులు ముందు ఉండడం చాలా అభినందియమని అన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుడు ఆర్ రమేష్ ను ఆయన అభినందించారు.